సాక్షి అనకాపల్లి

ఆదివారం । 15 । జూన్ । 2025

కొండలను ముద్దాడిన మేఘాలు



పాడేరు పట్టణ పరిసరాల్లో శనివారం ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం 3 గంటల వరకు వర్షం కురిసింది. ఆ తరువాత కొండలను ముద్దాడుతున్నట్టుగా మేఘాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

108లో ప్రసవం

- తల్లీ బిడ్డ క్షేమం



అంబులెన్స్‌లో జన్మించిన బిడ్డతో ఈఎంటీ కమలాదేవి

చీడికాడ: గిరిజన పంచాయతీ గోప్పూరుకు చెందిన విజయ 108 వాహనంలో శుక్రవారం రాత్రి పండంటి బిడ్డను ప్రసవించింది. నెలలు నిండి పురిటి నొప్పులు పడుతున్న ఆమెను చీడికాడ పీహెచ్‌సీకి 108లో తరలిస్తుండగా.. వాహనం ఖండివరం సమీపానికి చేరుకునే సమయానికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహన డ్రైవర్ లెక్కల ముత్యాలనాయుడు వాహనాన్ని ఆపడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కమలాదేవి వాహనంలోనే ఆమెకు సుఖ ప్రసవం జరిపారు. విజయ పాపకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది తల్లీ బిడ్డలను చీడికాడ పీహెచ్‌సీలో చేర్పించారు. ఇద్దరూ ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నట్లు ఈఎంటీ కమలాదేవి తెలిపారు.

ఏడాది పాలనా వైఫల్యాలపై పుస్తకావిష్కరణ నేడు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కూటమి ఏడాది పాలనా వైఫల్యాలపై 'పుస్తకావిష్కరణ' నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హాజరై పుస్తకం ఆవిష్కరిస్తారన్నారు.

'తల్లికి వందనం చిరుద్యోగులకు అందించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి: తల్లికి వందనం పథకాన్ని అత్యంత తక్కువ జీతాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశ, వెలుగు తదితర స్కీం కార్మికులతోపాటు విద్యా, వైద్య ఆరోగ్యశాఖలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరావు అన్నారు. స్థానిక సిటు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుద్యోగులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి తల్లికి వందనాన్ని చిరు ఉద్యోగులకు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్లకు అమలు చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. వీరికి తల్లికి వందనాన్ని అందకుండా చేయడం అన్యాయమన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

మురళీనగర్: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా పాలిసెట్ కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతుంది. పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27వ తేదీలోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓసీ/బీసీలు రూ.700 ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలి. కౌన్సెలింగ్/సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు జరుగుతుంది. విద్యార్థులు తమ సమీప హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, పాలిసెట్ ర్యాంకు కార్డు, పదో తరగతి లేదా దానికి సమానమైన మార్కుల మెమో, 4–10 తరగతుల స్టడీ సర్టిఫికెట్ తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. విశాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), పెందుర్తి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వివరాలకు https:// polycet.ap.gov.inలో చూడవచ్చు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పెట్టుకోవచ్చు. జూలై 1 నుంచి ఆప్షన్లు మార్చుకోవచ్చు. జూలై 3వ తేదీన సీట్లు కేటాయిస్తారని కన్వీనర్ డాక్టర్ నారాయణరావు తెలిపారు.

అర్హత ఉన్నా రాలేదు..



మాది నిరుపేద కుటుంబం. పొట్టకూటి కోసం కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు చదువుకోలేదు. చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ 9వ తరగతి పూర్తి చేసుకుని పదో తరగతిలోకి వచ్చాడు. ప్రతి రోజూ స్కూల్ వెళ్లేవాడు. హాజరు శాతం ఎక్కువగానే ఉంటుంది. మాకు కారు లేదు. కరెంట్ బిల్లు 200 మించిరాదు. కానీ తల్లికి వందనం ఇప్పటివరకు పడలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లపాటు అమ్మ ఒడి అందుకున్నాను. పేపర్‌లో వార్త చదివి బ్యాంకుకు వెళ్లి అడిగితే ఇంకా పడలేదు అన్నారు.

– కోరుకొండ నూకరత్నం, పూసర్ల వీధి, కోటవురట్ల మండలం

రూ.300 బిల్లును 300 యూనిట్లుగా రాశారు



మా పాప ప్రణతి ప్రభుత్వ పాఠశాలలోను, మా అబ్బాయి కోట యశ్వంత్ ప్రైవేటు పాఠశాలలోను చదువుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి ఏటా అమ్మ ఒడి పడింది. తల్లికి వందనం పథకం ద్వారా ఇద్దరు పిల్లలకు నగదు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న మాకు చేదు వార్త ఎదురైంది. ఉపాధి కూలీగా నేను, పాన్ షాప్ పెట్టుకుని నా భర్త పిల్లలను పోషించుకుంటున్నాం. మా ఇంటిలో కేవలం ఒక ఫ్యాన్, టీవీ, మూడు లైట్లు మాత్రమే ఉన్నాయి. నెలకు 60 నుంచి 100 యూనిట్ల వరకు మాత్రమే విద్యుత్ వాడుతున్నాం. రూ.300 బిల్లు చెల్లిస్తే..300 యూనిట్లుగా తప్పుగా రాసుకుని తల్లికి వందనం పథకానికి అనర్హురాలిని చేశారు.

– కోట సంధ్య, రేబాక గ్రామం, అనకాపల్లి మండలం

తల్లికి వందనం నిలుపుదల



నాకు 8వ తరగతి చదువుతున్న కుమార్తె భాగ్యలక్ష్మి, ఏడవ తరగతి చదువుతున్న ధనుష్ ఉన్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం వచ్చేది. కూటమి ప్రభుత్వం ఎంతమంది పిల్లలుంటే అందరికీ పథకం వర్తింప చేస్తామని చెప్పడంతో ఎంతో ఆశ పడ్డాను. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందని పథకం రద్దు చేశారు. షరతులు సడలించి పథకం వర్తింపచేయాలి.

– పాటూరి శిరీష, బుచ్చింపేట, రోలుగుంట మండలం

ఒక్కరికే వచ్చింది..



తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామన్నారు. కానీ నాలుగో తరగతి చదువుతున్న మా పాపకు రాలేదు. 9వ తరగతి చదువుతున్న మా కుమారుడికి రూ.13 వేలు వచ్చాయి. తల్లికి వందనం రాలేదని సచివాలయ సిబ్బందిని, పాఠశాల సిబ్బందిని అడిగితే తెలీదని చెబుతున్నారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటే బాగుంటుంది.

– మడగల యమున, కొరుప్రోలు, ఎస్.రాయవరం మండలం

వందనం కాదు.. వంచన



తల్లికి పంగనామం..!

- నిబంధనల పేరుతో తల్లికి వందనం లబ్ధిదారుల సంఖ్య కుదింపు
- 2022–23లో ఇంటికొకరు చొప్పున 1,52,870 విద్యార్థులకు వంపిణీ
- ఇపుడు ఎంత మంది పిల్లలున్నా అందరికీ ఇస్తామని కూటమి హామీ
- కానీ జిల్లాలో 1,79,272 మందినే అర్హులుగా తేల్చిన ప్రభుత్వం
- జిల్లాలో ఫస్ట్ నుంచి ఇంటర్ వరకు 2.2 లక్షల మంది విద్యార్థులు
- దరఖాస్తులు స్వీకరించకుండానే లబ్ధిదారుల ఎంపికపై అనుమానాలు
- 12 వేలు కంటే ఎక్కువ జీతం వస్తే తల్లికి వందనం కట్
- ఎటువంటి ఆస్తులు లేకున్నా ఉన్నట్లు చూపిస్తూ అనర్హులుగా ప్రకటన

సాక్షి, అనకాపల్లి: 'తల్లికి వందనం' అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తల్లులకు పంగనామాలు పెడుతోందనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, తాజాగా నిబంధనల పేరుతో లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత విధించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నెల 12వ తేదీ నుంచే డబ్బులు జమ అవుతాయని పత్రికా ప్రకటనలు రావడంతో బ్యాంకుల వద్ద పడిగాపులు కాసిన అనేకమంది తల్లులు.. డబ్బులు జమ కాకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

హామీల ఉల్లంఘన, నిబంధనల వల

ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం, ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. అయితే, 'ఫస్ట్ క్లాస్‌లో చేరిన వారికి వచ్చే ఏడాది నుంచి మాత్రమే ఇస్తాం' అంటూ ప్రభుత్వం మాట మార్చిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేల కంటే ఎక్కువ జీతం వచ్చిన వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగించారు. ఎటువంటి ఆస్తులు లేకపోయినా, ఉన్నట్లుగా చూపిస్తూ మరికొంతమందిని పథకం నుంచి తప్పించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

దరఖాస్తులు స్వీకరించకుండానే..


ఏ పథకానికైనా దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించి లబ్ధిదారులను గుర్తించడం తప్పనిసరి. కానీ ఈ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించకుండానే లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించారు. గత విద్యా సంవత్సరం డేటా ఆధారంగా జాబితాను సిద్ధం చేయడం వల్ల, ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు పథకం వర్తించదని తల్లిదండ్రులకు సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

ఆస్తుల లింకుతో ఇక్కట్లు

గతంలో 'అమ్మ ఒడి' తీసుకున్న లబ్ధిదారులు సైతం ఈ జాబితాలో అనర్హులుగా తేలడం గమనార్హం. దీనిపై సచివాలయంలో ఆరా తీయగా, వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ ఆస్తి ఉన్నట్లు లేదా రూ.12 వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉన్నట్లు చూపుతూ అనర్హులుగా తేల్చినట్లు చెబుతున్నారు. వాస్తవానికి, అనర్హుల్లో అత్యధిక శాతం మందికి ఆస్తులు లేనప్పటికీ, ఉన్నట్లు చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆస్తులు లేవని, అద్దె ఇంట్లో ఉన్నామని చెబుతున్నప్పటికీ, సచివాలయం సిబ్బంది తమకు సంబంధం లేదని జీవీఎంసీ కార్యాలయానికి వెళ్లాలంటూ తిప్పుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే, మ్యాపింగ్ చేపట్టినప్పుడు, అద్దెకున్న వారి ఆధార్ కార్డును ఇంటి ఆస్తి పన్నుతో లింక్ చేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని తెలుస్తోంది. దీంతో లబ్ధిదారుల ఆధార్ నెంబర్ పరిశీలిస్తే, ఆస్తి ఉన్నట్లు చూపిస్తోంది. ఈ లింకును తొలగించడానికి సచివాలయం సిబ్బంది నిరాకరించడం, ఉన్నతాధికారులు సైతం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత

ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ 'తల్లికి వందనం' కింద రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేశారు. దీని ప్రకారం జిల్లాలో 2,22,797 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అంచనా వేశారు. కానీ కేవలం 1,19,357 మంది తల్లులకు గాను 1,79,272 మంది పిల్లలకు మాత్రమే ఇస్తున్నట్లు ప్రకటించారు. 2022–23లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకాన్ని 1,52,870 మందికి అమలు చేసింది. ఈసారి పిల్లలందరికీ ఇస్తామన్నారు కాబట్టి మరో 70 వేలమందికి అందించాల్సి ఉండగా కేవలం 26,402మందికి మాత్రమే అదనంగా వచ్చింది. 43,525 మంది విద్యార్థులను అనర్హత వేటు వేశారు.



సచివాలయాల్లో అర్హులు, అనర్హుల జాబితాలుప్రదర్శిస్తున్నారు. అనర్హుల జాబితాలే పెద్దగా ఉంటున్నాయి..

'నీట్'గా రాణించారు..



సూర్యచరణ్ (59వ ర్యాంక్)

పాయకరావుపేట: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్టు (నీట్)లో జిల్లా విద్యార్థులు రాణించారు. పాయకరావుపేటకు సమీపంలోని బెండపూడికి చెందిన డి.సూర్యచరణ్ జాతీయ స్థాయిలో 59వ ర్యాంకు సాధించాడు. ఆయన 10వ తరగతి శ్రీప్రకాష్‌లో, ఇంటర్మీడియట్ విశాఖపట్నం నారాయణ కాలేజీలో చదివాడు. న్యూరాలజిస్ట్ కావాలన్నది తన కోరికని తెలిపాడు. మంచి ర్యాంకు రావడంతో ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో సీటు వస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపాడు. తల్లిదండ్రులు ప్రసాద్, రాణి ఒడిశాలో స్థిరపడ్డారు. తండ్రి వ్యవసాయం చేస్తారు.

కార్డియాలజిస్టును అవుతా..

నర్సీపట్నం: నీట్ ఫలితాల్లో కోటవురట్ల మండలం కె.వెంకటాపురానికి చెందిన గొల్లు లహరి 558 మార్కులు సాధించింది. ఆమెకు ఆల్ ఇండియా స్థాయిలో 8878వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 3661 ర్యాంకు వచ్చింది. ఏపీఈఏపీసెట్‌లో 155వ ర్యాంకు సాధించింది. తండ్రి వెంకట నాగేశ్వరరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా తల్లి ఉమారత్నం గృహిణి. లహరి పదో తరగతి వరకు నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో, ఇంటర్ విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో చదువు పూర్తి చేసింది. నీట్‌లో మంచి ర్యాంకు రావడం సంతోషంగా ఉందని, ఎంబీబీఎస్ పూర్తి చేసి కార్డియాలజిస్ట్ అవుతానని పేర్కొంది.



లహరికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



మనీషాకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

మనీషా సాయికుమారికి 3554వ ర్యాంకు

కె.కోటపాడు: నీట్‌లో చౌడువాడ గ్రామానికి చెందిన రాజి మనీషా సాయికుమారి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఆల్ ఇండియా స్థాయిలో 3554 ర్యాంకు సాధించింది. ఇటీవల వెలువడిన ఏపీఈఏపీసెట్‌లో కూడా సాయికుమారి 144వ ర్యాంకు తెచ్చుకుంది. ఆమె పదో తరగతి వరకు కొమ్మాదిలోని జవహర్ నవోదయ స్కూల్లో చదువుకొని 500 మార్కులకు 495 సాధించింది. ఇంటర్‌లో 986 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు సత్యనారాయణ, సోనియా వ్యవసాయ కుటుంబానికి చెందినవారు.

యూపీఎస్సీకి ఎంపికైన దీపక్



తల్లిదండ్రులు శ్రీనివాసరావు, చంద్రావతితో దీపక్

నర్సీపట్నం : కేంద్ర సాయుధ బలగాల్లో ఉన్నతాధికారుల నియామకం కోసం నిర్వహించే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో కోటవురట్ల మండలం, వేములపూడికి చెందిన దేవాడ దీపక్ విజయం సాధించారు. బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ వంటి సాయుధ దళాల్లో అధికారుల నియామకం కోసం ఏటా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ పరీక్షలు నిర్వహిస్తుంది. 2024 సంవత్సరానికి నిర్వహించిన పరీక్షల్లో రాత, మౌఖిక, శారీరక దృఢ పరీక్షల్లో దీపక్ జాతీయస్థాయిలో 105వ ర్యాంకు సాధించారు. ఈ ర్యాంకుతో దీపక్ ఏదో ఒక సాయుధ దళంలో అసిస్టెంట్ కమాండెంట్ హోదాలో నియమితులు కానున్నారు. దీపక్ తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి చంద్రావతి గృహిణి. దీపక్ పదో తరగతి విశాఖపట్నంలో శ్రీచైతన్య, ఇంటర్ విజయవాడ శ్రీచైతన్యలో చదివారు. అగర్తల ఎన్ఐటీలో 2019లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం తండ్రి ప్రోత్సాహంతో సివిల్స్ సాధనపై దృష్టి సారించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి సాయుధ బలగాలకు ఎంపికయ్యారు. సాయుధ బలగాలకు ఎంపిక కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూనే సివిల్స్ సాధనకు ప్రయత్నిస్తానని దీపక్ చెప్పాడు. కేంద్ర బలగాలలో సీఐఎస్ఎఫ్‌లో అవకాశం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీపక్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- వర్షాలతో ప్రారంభమైన నారుమడి పనులు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు



నారుమడుల్లో చల్లడానికి సిద్ధంగా ఉంచిన శుద్ధి చేసిన వరి విత్తనాలు

చోడవరం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పనులు ముందుగానే ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులంతా నారుమడులు సిద్ధం చేసే పనిలో బిజీ అయ్యారు. గ్రామాలన్నీ వ్యవసాయ పనులతో సందడిగా మారాయి. రైతులు విత్తనాల కోసం వ్యవసాయ కార్యాలయాల వద్ద పడిగాపులు పడే పరిస్థితి లేకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లోనే (ఆర్బీకేలు) ఆన్‌లైన్‌లో తమ ఆర్డర్ నమోదు చేసే అవకాశం కల్పించింది. ఈ ఏడాది కూడా ఇప్పటికే రైతులంతా తమకు కావలసిన విత్తనాలను సమకూర్చుకున్నారు. వ్యవసాయ బోర్లు, జలాశయాలు, ఆయకట్టు భూముల్లో రైతులు కొందరు తమ వద్ద ఉన్న సొంత విత్తనాలను ఇప్పటికే నారుమడుల్లో జల్లుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 2 లక్షల 20 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా వేయగా అదనంగా మరో 3 వేల ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రతి ఆర్బీకేలోనూ రైతులు అదనుకు విత్తనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.



నారుమడులకు దుక్కి దున్నుతున్న రైతు

బీపీటీ రకాల వైపు రైతుల మొగ్గు

ఈ ఏడాది సాధారణ రకాల వైపు వెళ్లకుండా బీపీటీ రకాలైన సోనామసూరి, ఆర్‌జీఎల్ రకాలకే రైతులు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చారు. రైతులు దిగుబడిలో తమకు కావలసింది ఉంచుకోగా మిగతా ధాన్యాన్ని అమ్ముకోవడానికి సిద్ధం చేసుకున్నప్పుడు ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా మిల్లర్లను గ్రామాలకు రప్పించి కొనుగోలు చేసే విధానాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో నేటికీ ఆ పద్ధతిలోనే ధాన్యం కొనుగోలు జరుగుతోంది. వాతావరణం కూడా సకాలంలో అనుకూలించడం, ఆశించిన వర్షాలు కురవడంతో జలాశయాల ఆయకట్టు భూములకు ముందుగానే నారుమడులు వేసుకునేందుకు నీరు విడుదలకు సిద్ధం చేశారు. జిల్లాలో పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతాలైన చోడవరం, మాడుగుల నియోజకవర్గాలతో పాటు పాయకరావుపేట, నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల పరిధిలో చెరకు, సరుగుడు సాగు చేసే భూముల్లో సైతం ఈ ఏడాది వరి సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. జిల్లాలో అన్ని సుగర్ ఫ్యాక్టరీలు మూసివేయడం, గోవాడ ఫ్యాక్టరీలో సైతం అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతో రైతులంతా వరి సాగుపైనే దృష్టి సారించారు.

వరి సాగు పెరిగే అవకాశం



జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. చాలామంది రైతులు సొంత విత్తనాలు సిద్ధం చేసుకోగా, కొత్తగా వరి వేసే రైతులు కూడా ఈ ఏడాది ఆర్బీకేల్లో విత్తనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా 23 వేల 300 మెట్రిక్ టన్నుల వరి విత్తనాలకు ప్రతిపాదన పెట్టాం. ఇప్పటికే చాలా వరకు ఆర్బీకేలకు విత్తనాలు సరఫరా చేశాం. చెరకు, సరుగుడుకి ప్రత్యామ్నాయంగా వరిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో నారుమడులు కూడా సిద్ధం చేసుకుంటున్నారు.

– బి.మోహనరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

మోకాళ్లపై నిరసన

బీఎన్ రోడ్డు పూర్తి చేయలేదని ఎద్దేవా

రావికమతం: ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు అన్నారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కొత్తకోట బీఎన్ రోడ్డుపై మోకాళ్లపై వినూత్నంగా నిరసన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారని, ఇప్పటికీ నెరవేర్చలేదని గోవిందరావు అన్నారు. వడ్డాది, విజయరామరాజుపేట బ్రిడ్జిలు, నర్సీపట్నం నుంచి చోడవరం వరకు రోడ్డు పనులు తక్షణమే చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు పనులు, వడ్డాది, విజయరామరాజుపేట బ్రిడ్జి పనులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గేమిల వాసు, సింగారపు వలసయ్య, పి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



బీఎన్ రోడ్డుపై వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

క్యాన్సర్‌కు కళ్లెం



IIలో

'మాన్యువల్ కౌన్సెలింగ్‌తో ఎస్‌జీటీలకు అన్యాయం'

నాతవరం : ప్రభుత్వం మాన్యువల్ పద్ధతిలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ చేయడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ అన్నారు. ఆయన శనివారం నాతవరంలో విలేకరులతో మాట్లాడారు. హెచ్‌ఎంలు, ఎస్‌ఏ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ చేయడం ద్వారా సమాన న్యాయం జరిగిందన్నారు. యూనియన్ నాయకులు కూటమి నాయకులు నుంచి ఎలాంటి ప్రలోభాలు లేకుండా సక్రమంగా చేసారన్నారు. వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఆన్‌లైన్ ద్వారా హెచ్‌ఎంలు, ఎస్‌ఏలకు ఆర్డరు కాపీలు వచ్చాయన్నారు. ప్రస్తుతం ఎస్‌జీటీలను వెబ్ కాకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ వల్ల సీనియర్ మారుమూల ప్రాంతాల్లో పని చేసే ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. కూటమి నేతలు, యూనియన్ నాయకులు అనుచరులకు కావసిన పాఠశాలను దక్కించుకునేలా ప్రక్రియ చోటు చేసుకో వచ్చన్నారు. రోడ్డు పాయింట్ ఉన్న ఖాళీ బయటకు


ఎంఈవో తాడి అమృత్‌కుమార్

వెల్లడి చేయకుండా చేసేందుకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా వీలుంటుందన్నారు. వారి ఒత్తిళ్ల నడుమ మాన్యువల్ కౌన్సెలింగ్ జరిగే అవకాశం ఉండొచ్చునని అధిక శాతం ఉపాధ్యాయులు వాపోతున్నారన్నారు. వెబ్ కౌన్సెలింగ్ చేయడం వల్ల రోజులు, గంటల తరబడి నిరీక్షణ చేసే ఇబ్బంది ఉండదన్నారు. సీనియారిటీ ప్రకారం వారు కోరుకున్న పాఠశాల కేటాయింపు ఉంటుందన్నారు. వారు ఆర్డర్ సైతం ఆన్‌లైన్‌లో పొందవచ్చునన్నారు. మొదట్లో ప్రభుత్వం హెచ్‌ఎం, ఎస్‌ఏలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి కూటమి పెద్దలు, యూనియన్ నాయకులు ఒత్తిళ్లకు తలొగ్గి ఈ విధంగా చేయడంతో అధిక శాతం ఎస్‌జీటీ టీచర్లలో వ్యతిరేకత కన్పిస్తుందన్నారు.



- హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో బ్లాక్
- ఎనిమిది అంతస్తుల్లో 3.9 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
- 2027 నాటికి అందుబాటులోకి అత్యుత్తమ, అధునాతన వైద్య సేవలు
- టాటా మెమోరియల్ సెంటర్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.550 కోట్లు విరాళం
- ఇంటెన్సివ్ కీమో, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, అధునాతన రేడియేషన్‌థెరపీ ఇలా మరెన్నో..

విశాఖ సిటీ: క్యాన్సర్ కర్కశమైనది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ కబళిస్తోంది. అటువంటి మహమ్మారి పీచమనచడానికి విశాఖలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఉత్తరాంధ్ర, ఒడిశా రాష్ట్రాల క్యాన్సర్ బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న అగనంపూడి ప్రాంతంలో ఉన్న హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్(హెచ్‌బీసీహెచ్‌ఆర్‌సీ)లో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తూర్పు భారత దేశంలోనే అత్యుత్తమ స్పెషలైజ్డ్ క్యాన్సర్ చికిత్సా కేంద్రాల్లో ఒకటిగా నిలిచేలా దీన్ని తీర్చిదిద్దనున్నారు. ప్రధానంగా పీడియాట్రిక్, హెమటోలింఫాయిడ్(శిశు, రక్త) క్యాన్సర్ల చికిత్స, పరిశోధనలకు సంబంధించి అతి పెద్ద కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు.

క్యాన్సర్ రోగులకు అనేక సేవలు

ఈ కొత్త బ్లాక్ ద్వారా క్యాన్సర్ రోగులకు అనేక వైద్య సేవలు అందనున్నాయి. ఇందులో ఇంటెన్సివ్ కీమోథెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, అధునాతన రేడియేషన్ థెరపీ, కార్ టీ–సెల్ థెరపీ లాంటి అధునాతన ఇమ్యునోథెరపీలు, మూడు లీనియర్ యాక్సిలరేటర్లు, ఎంఆర్‌ఐ, సీటీ అండ్ పెట్ స్కాన్లతో పాటు అత్యంత ఆధునిక మెడికల్ ఇమేజింగ్, డయాగ్నోస్టిక్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే ఇందులో 14 బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ గదులు, 14 ఐసీయూలు, 5 ఆపరేటింగ్ థియేటర్లు, పరిశోధనల కోసం ప్రయోగశాలలు, చికిత్స ప్లానింగ్, శిక్షణ కోసం జాయింట్ డిస్కషన్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పీడియాట్రిక్, హెమటోలింఫాయిడ్ క్యాన్సర్లకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స, బ్లడ్ సెంటర్, పౌష్టికాహారం, పునరావాసం లాంటి సేవలు అందనున్నాయి.

ఏటా 3 వేల మందికి చికిత్స అందించేలా..

ఐసీఐసీఐ ఫౌండేషన్ బ్లాక్ ఫర్ చైల్డ్ అండ్ బ్లడ్‌క్యాన్సర్ భవనాన్ని 8 అంతస్తుల్లో సుమారు 3.9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఈ కొత్త భవనంలో 555 పడకలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం అగనంపూడిలో ఉన్న హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో గత మూడేళ్లుగా రోజూ కొత్తగా సుమారు 200 మంది పీడియాట్రిక్ క్యాన్సర్ రోగులు, 350–400 మంది హెమటోలింఫాయిడ్ క్యాన్సర్ పేషంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. కొత్త బ్లాక్ అందుబాటులోకి వచ్చిన తర్వాత బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పాటు ప్రస్తుత వైద్య సేవలను గణనీయంగా విస్తరించేందుకు, అలాగే ఇమ్యునోథెరపీకి వెసులుబాటు కలగనుంది. మరో 3 వేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఈ కొత్త బ్లాక్‌ల్లో అధునాతన వైద్య సదుపాయాలు, పరిశోధన విభాగాలు ఉండనున్నాయి. పెరుగుతున్న క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 2027 నాటికి ఈ కొత్త బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఉన్నారు.



టీఎంసీకి ఐసీఐసీఐ రూ.550 కోట్లు విరాళం

ఈ భారీ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ఐసీఐసీఐ బ్యాంక్ భారీ విరాళాన్ని టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ)కు ప్రకటించింది. బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) నిధులు రూ.550 కోట్లతో ఈ అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్‌ని నిర్మిస్తోంది. దేశంలో క్యాన్సర్ కేర్‌కు సంబంధించి విశాఖ, నవీ ముంబై, న్యూ చండీగఢ్‌లో కొత్తగా మూడు టీఎంసీ కేంద్రాల ఏర్పాటుకు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,800 కోట్లు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో రూ.550 కోట్లతో విశాఖలో శిశు, రక్త క్యాన్సర్ చికిత్సకు తూర్పు దేశంలోనే అతిపెద్ద అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో అధునాతన ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఐసీఐసీఐ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్ కుమార్ సిన్హా(ఫైల్)

10 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని గూడ్స్ షెడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 10 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.2,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న పట్టణ ఎస్‌ఐ ఈశ్వరావు ఆధ్వర్యంలో గస్తీ తిరుగుతున్న పోలీసులకు రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ వద్ద సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గంజాయి తీసుకువస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారని తెలిపారు. వారిని వెంబడించి పట్టుకున్నామన్నారు. వీరిలో జి.మాడుగుల మండలం కోడాపల్లి గ్రామానికి చెందిన రామన్ ప్రభాకర్ ఏజెన్సీ ప్రాంతంలో 10 కేజీల గంజాయిని రూ.20 వేలకు కొని తన స్నేహితుడైన తమిళనాడులోని మధురై మండలం ఉసిలంపట్టి గ్రామానికి చెందిన జయవీరన్ కారుతి వీర దేవరతో కలిసి అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో గంజాయిని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ ఈశ్వరరావు

దించడానికి ఒప్పందం చేసుకున్నాడని తెలిపారు. రామన్ ప్రభాకర్‌పై అరకు పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉండగా, రెండో నిందితుడు వీర దేవర్‌కు తమిళనాడులో గంజాయి కేసులో నిందితుడిగా ఉన్నాడన్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్టు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న హెచ్‌సీకి ఆర్థిక సాయం

అనకాపల్లి: అల్లూరు సీతా రామరాజు జిల్లా చింతపల్లి పోలీస్‌స్టేషన్లో హెచ్‌సీ గా విధులు నిర్వహిస్తున్న ఓ. గణేశ్వరరావు అనారోగ్యం కారణంగా విశాఖ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ 1990 బ్యాచ్ నుంచి అసోసియే షన్ అధ్యక్షుడు కె.అనిల్, ప్రధాన కార్యదర్శి ముబారక్‌లు ఆస్పత్రిలో చికి త్స పొందుతున్న గణేశ్వరరావుకు శనివారం రూ.20వేలు చెక్కును అందజేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1990 బ్యాచ్‌కు చెందిన సహోద్యోగులు ఏ రకమై న కష్టాల్లో ఉన్నా ఆదుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పూర్ణ, వెంకటేశ్వర్లు, రామారావు, మూర్తి, శ్రీను పాల్గొన్నారు.


హెచ్‌సీ గణేశ్వరరావుకు రూ.20వేల చెక్కును అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కార్పొరేట్ పాఠశాలల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్‌ఎఫ్ ఆందోళన

అనకాపల్లి టౌన్ : చదువు పేరుతో వేల రూపాయలు దోచుకుంటున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి జి ఫణీంద్రకుమార్ కోరారు. స్థానిక నరిసింగరావు పేట నారాయణ కళాశాల ఎదుట శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రెండవ శనివారం అయినా క్లాసులు నిర్వహిస్తుండపై ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అభ్యతరం వ్యక్తం చేశారు. తక్షణమే విద్యార్థులను బయటకు పంపాలని నినాదాలు చేశారు. సుమారు 15 నిమిషాలు అనంతరం యాజమాన్యం స్పందించి విద్యార్థులను బయటకు పంపించివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ ఐటమ్స్ అమ్ముతున్న విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పేరుతో వారి కళాశాల పాఠశాల పేర్లు ముద్రించి అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, జిల్లా నాయకులు దేవి ప్రసాద్, సాయితేజ, నాయుడు, శివాజీ పాల్గొన్నారు.



నరసింగరావు పేట నారాయణ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి


తీడ శివారు కచ్చళ్లపాలెంలో పోలీసులకు పట్టుబడిన పేకాట రాయుళ్లు

కశింకోట : తీడ గ్రామ శివారు కచ్చళ్లపాలెంలో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేసి భారీగా రూ.1,02,348 నగదు పట్టుకున్నారు. 13 మందిని అరెస్టు చేసి 4 మోటారు వాహనాలు, 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలు ప్రకారం...ముందుగా అందిన సమాచారం మేరకు గుట్టు చప్పుడు కాకుండా కచ్చళ్లపాలెంలో పేకాట శిబిరంపై సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, పి.మనోజ్‌కుమార్,పోలీసు సిబ్బంది దాడి చేశారు. నిందితులను పట్టుకోవడంతో పాటు మోటారు వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితిలోను సహించేది లేదని సీఐ స్వామినాయుడు హెచ్చరించారు.

ఫార్మా మృతుడికి మిత్రుల అశ్రు నివాళి


ఫార్మా మృతుడు కుమార్‌కు నివాళులర్పించిన మునగపాక యువకులు

మునగపాక : పరవాడ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన శరగడం కుమార్‌కు మునగపాక యువకులు శనివారం ఘన నివాళులర్పించారు. మునగపాకకు చెందిన శరగడం కుమార్ పరవాడ ఫార్మాలో పనిచేస్తూ విషవాయువు పీల్చడం కారణంగా మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో కుమార్ మృతదేహాన్ని విశాఖ కేజీహెచ్ నుంచి శనివారం స్వగ్రామం తీసుకువచ్చారు. దీనిలో భాగంగా అనకాపల్లి బైపాస్ రోడ్డు జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ చేస్తూ కుమార్ మృతదేహాన్ని తీసుకువచ్చారు. శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

25న ఏపీ ప్రజా నాట్యమండలి ప్రథమ మహాసభ


కె.కోటపాడులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కె.కోటపాడు : ఈ నెల 25న అనకాపల్లిలో ఏపీ ప్రజా నాట్యమండలి ప్రథమ మహాసభను నిర్వహిస్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు, పొంతపల్లి రామారావు తెలిపారు. కె.కోటపాడులో శనివారం మహాసభకు సంబంధించిన కరపత్రాలను వీరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేముడుబాబు, రామారావు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని వీరు తెలిపారు. కళాకారులు పెద్ద సంఖ్యలో అనకాపల్లిలో కాపుగంటి గోవిందరావు భవన్‌లో నిర్వహించే మహసభలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

గంగాదేవిపేట వద్ద రోడ్డు ప్రమాదం


ప్రమాదానికి కారణమైన కారు


కారు ఢీకొట్టడంతో బోల్తాపడిన ఆటో

మునగపాక: తిమ్మరాజుపేట నుంచి ప్రయాణికులతో ఆటో వెళుతుండగా, ఇదే సమయంలో ఆటోను తప్పించే క్రమంలో వెనుకగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో కారు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు చిన్న గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన వారిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని ప్రధాని ప్రకటించాలి

- ఈ నెల 16 నుంచి 21 వరకు నిరసనలు
- కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ప్రకటన

డాబాగార్డెన్స్ (విశాఖ): నగరానికి వస్తున్న ప్రధాని మోదీ.. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాలని జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. అన్యాయంగా తొలగించిన 4,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు నిరాహారదీక్ష శిబిరంపై ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని ఆపాలని జేఏసీ డిమాండ్ చేసింది. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు ఎం.మన్మధరావు, బి.నాగభూషణం, ఎస్.కనకారావు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నాలుగున్నరేళ్లుగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. అధికారంలో ఎవరున్నా పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ శిబిరంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. శిథిలమైన ఈ శిబిరాన్ని పునర్నిర్మించేందుకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పూనుకుంటే.. ప్రభుత్వం పోలీసులను పంపి అడ్డుకుంటోందని జేఏసీ నేతలు ఆరోపించారు. శిబిరంలో కూర్చోకుండా శాశ్వత, కాంట్రాక్టు కార్మికులను బెదిరించడం కార్మికుల హక్కును కాలరాయడమేనన్నారు.

పద్మశాలీ గ్లోబల్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్ నేడు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘాల నాయకులు

అచ్యుతాపురం రూరల్ : విశాఖ సిటీలోని శంకర మఠం ఎదురుగా పద్మశాలీ భవనంలో పద్మ శాలీ గ్లోబల్ ట్రస్ట్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి పద్మశాలీలు హాజరు కావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు పిలుపునిచ్చారు. శనివారం అచ్యు తాపురం చేనేత కార్యాలయం వద్ద జిల్లా పద్మశాలీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లా డుతూ విశాఖలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి జరగబోయే కుల, జనగణన కార్యక్రమంలో హాజరై ప్రభుత్వానికి పద్మశాలీల సంఖ్యా బలం తెలియజేయాలన్నారు. దుప్పితూరు భద్రావతీ చేనేత సహకార సంఘం అనకాపల్లి జిల్లా చేనేత అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు, మేనేజర్ మాడెం అప్పారావు, ఉమ్మడి విశాఖ జిల్లా చేనేత నాయకులు ఋషిబాబు, జగ్గారావు, రమణమ్మ, రాజు, అప్పలరాజు, ఈశ్వర్రావు, గుడ్డటి రాజు, నానాజీ, పప్పు సరోజని పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా గౌరీ టీచర్స్ కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

అనకాపల్లి: విశాఖ ఉమ్మడి జిల్లా గౌరీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరిశెట్టి సన్యాసి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గవరపాలెం పార్కు స్కూల్ ఆవరణలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా దాడి వెంకటజగ్గప్పారావు, కోశాధికారిగా బి.చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడిగా భీమరశెట్టి కోటేశ్వరరావు, సభ్యులుగా కాండ్రేగుల శంకరబాబు, ఆళ్ల ఓంరాము. కె.ఎం.నాయుడు ఎన్నికయ్యారు. వీరితో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల దుర్గాప్రసాద్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. పై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాల పాటు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

యువత రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

అనకాపల్లి టౌన్: యువత ఎక్కువగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ కోరారు. సర్వేజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ రెసిడెన్సీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకరు చేసే రక్తదానంతో మరో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ శిబిరంలో 118 మంది పాల్గొని రక్తదానం చేశారు. వీరికి సీఐ ప్రోత్సాహక షీల్డ్‌లు బహూకరించారు. కార్యక్రమంలో కోరిబిల్లి హరి, కాండ్రేగుల శ్రీరామ్, పలకా రవి, ఆళ్ల ప్రవీణ్ కుమార్, రేబాక మధు, విల్లూరి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు వివిధ అలంకరణలతో దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం స్వామివారిని వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలమాలలు, తులసీమాలలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

సింహగిరి వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా కిరణ్

సింహాచలం: సింహగిరి వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా ముగ్గ కిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యాపారులంతా శనివారం ఏకగ్రీవంగా ఎన్నికుని సత్కరించారు. కిరణ్ గతంలో కూడా సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడిగా పని చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 66 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,450	4,470
రెండో రకం	3,670	3,680
మూడో రకం	3,000	3,600

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-2	: అందాల రాక్షసి
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 12 యూనిట్లు, బీ పాజిటివ్ -6, ఓ పాజిటివ్ -20, ఏబీ పాజిటివ్ -5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 343 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ



భీమునిగుమ్మం స్కూల్‌కు వెళ్లే రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు

- పట్టణంలో కానరాని పూడిక తీత
- వర్షం కురిస్తే రోడ్లపై నీరు
- పట్టణ ప్రజలు, వాహనదారులకు ఇక్కట్లు

అనకాపల్లి: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చినుకు పడితే రహదారులపై వర్షపు నీరు చేరుతోంది. ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ డ్రైనేజీ ఉందో తెలియని పరిస్థితిలో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిన్నాభిన్నంగా మారాయి. జిల్లా కేంద్రంగా అనకాపల్లి పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి పాలకులు పట్టణాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు నివసిస్తున్నప్పటికీ డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో విఫలమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనలో డ్రైనేజీలో కనీసం పూడిక తీత పనులు చేయలేదు. దాంతో డ్రైనేజీలు చెత్తా చెదారంతో నిత్యం దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడుతున్న సమయంలో వర్షపు నీరు డ్రైనేజీలో పారేందుకు అవకాశం లేకపోవడంతో రహదారులపై నిలిచిపోతోంది. ఈ నీటిలో గొయ్యి కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో గృహాల యాజమానులు మరుగుదొడ్లను కాలువలపై ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెలువడుతోంది. దీనికితోడు ఈగలు, దోమలు వాసంగా చేసుకుని వ్యాధులు బారినపడే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నర్సింగరావుపేటలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు నిలిచిపోయిన వర్షపు నీరు

పట్టణంలో పారిశుధ్య పరిస్థితి ఇది...

- పట్టణంలో ప్రధానమైన నాలుగు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. నేటికీ వీటిల్లో పూడిక తొలగించలేదు.
- గుండాల జంక్షన్ నుంచి గవరపాలెం సంతబయలు వరకూ ఎల్లయ్యకాలువ, నాగులాపల్లి కాలువ, చెర్లోపల్లి కాలువ, పులికాలువలో ఏటా వేసవిలో పూడికతీత పనులు చేపట్టాలి. కూటమి పాలకులు చేయకపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రధాన కాలువలను ఆనుకుని రెండు వేల పైచిలుకు పిల్లకాలువలు పట్టణ పరిధిలో 20 కిలోమీటర్ల మేర పొడవున ఉన్నాయి.
- జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత అనకాపల్లిలో జనాభా రెండు లక్షలకు చేరుకుంది. దీంతోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ పనులపై పట్టణానికి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.
- డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుకుని, మురుగు పారేందుకు వీలు లేకపోవడంతో ఎక్కడికక్కడే పేరుకుపోతోంది.
- జనాభాకు తగ్గట్టుగా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులను నియమించలేదు. ఉన్న పారిశుధ్య కార్మికులపై పని ఒత్తిడి పెరిగిపోయి తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు.
- రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైన ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి.
- డ్రైనేజీలు దోమలకు నిలయంగా మారాయి. రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు దోమకాటుకు గురికావలసిన పరిస్థితి ఏర్పడింది.
- ఏడాది నుంచి బ్లీచింగ్ పౌడర్ ఎక్కడా జల్లడం లేదు.
- రోజు రోజుకు డ్రైనేజీల్లో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.



చెరువును తలపిస్తున్న ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ



ఉడ్‌పేట స్కూల్‌కు వెళ్లే దారిలో నిలిచిపోయిన వర్షం నీరు



గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య విభాగ కార్యాలయం

కూటమి పాలనలో డ్రైనేజీ పనులు నిల్

ఏటా వేసవిలో పట్టణ డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనలో చెత్తాచెదారాలు తొలగించలేదు. పట్టణ ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో వర్షపునీరు రహదారులపై నిలిచిపోతోంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి. – పి.కల్యాణ్, మిరియాల కాలనీ, అనకాపల్లి

'తల్లికి వందనం' నగదులో కోతలు వద్దు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా 'తల్లికి వందనం' నగదును అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. అడ్డగోలు నిబంధనలతో 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఆదాయ పరిమితిని సడలించాలని, గ్రామాల్లో రూ.2.5 లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు తల్లికి వందనం వర్తింపజేయాలన్నారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ నగదు వేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్స్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకుమించిన నిబంధనలు పెట్టి లబ్ధిదారులతోపాటు నగదును తగ్గించడం సరికాదన్నారు. రూ.15 వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని, ఇప్పుడు రూ.2 వేలు మినహాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఇంత వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే ఆ పేరుతో ఈ పథకం మినహాయించడం అన్యాయమన్నారు. విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట్‌ల ఖాతాలకు చెల్లించడం ప్రభుత్వ విద్యను దెబ్బతీయడమేన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ ఈ పథకం అమలు చేయాలని కోరారు.

మత్తు పదార్థాలతో జీవితం ఛిద్రం

కశింకోట: మత్తు పదార్థాలకు ఉద్యోగులు, కార్మికులు దూరంగా ఉండాలని ఎస్ఐ కె. లక్ష్మణరావు కోరారు. మండలంలోని తాళ్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న నాగార్జున సిమెంట్ పరిశ్రమలో 'నయా ముక్తి భారత్ అభియాన్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. మత్తు పదార్థాలు కలిగి ఉండి, సేవించి పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాలు, ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరికి తమ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు వెల్లడించవద్దని సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కొత్తపల్లిలో శుక్రవారం రాత్రి నయా ముక్తి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ అల్లు స్వామినాయుడు ప్రజలను చైతన్యపరిచారు. సారా తయారీ, విక్రయం చేయడం చట్ట విరుద్ధమని, వీటితో పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా తాగడం ఆరోగ్యానికి హానికరమన్నారు.

గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలలపై చర్యలకు డిమాండ్

సబ్బవరం: పుట్టగొడుగుల్లా వెలుస్తున్న గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు జూనియర్ కళాశాలల జాయింట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. జనార్దన్ కోరారు. సబ్బవరంలోని 4ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేకుండా కాలేజీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌ను రోడ్డున పడేయొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సబ్బవరంలో ఒక కళాశాల ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి కలెక్టర్‌తో పాటు ఇంటర్ బోర్డ్ కమిషనర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని, డీఐఈవో దృష్టికి తీసుకెళ్లడంతో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కె. నాగేశ్వరరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ. శేషగిరిరావు, బీశెట్టి మురళీప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు టి. మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ప్రైవేటు జూనియర్ కళాశాలల జాయింట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు

పరిశ్రమల్లో భద్రతను ఉపేక్షిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

పరవాడ: ఫార్మాసిటీపరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే సహించబోమని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య పరిశ్రమల యాజమాన్యాలను హెచ్చరించారు. గొర్లివానిపాలెం లారల్ రీజినల్ కార్యాలయంలో పరిశ్రమ యాజమాన్యాలతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన సామగ్రిని వారికి సమకూర్చడానికి యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు పరిశ్రమల్లో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. క్రమం తప్పకుండా పరిశ్రమల్లో ఆడిట్లు, మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. భద్రత ప్రోటోకాల్‌పై కార్మికులకు శిక్షణ కల్పించాలన్నారు. పరిశ్రమల ప్రాంగణాల్లో ఉద్యోగులు, కార్మికులు రక్షణ పరికరాలు విధిగా ధరించాలన్నారు. ప్రమాదకర కార్యకలాపాలను అర్హత కలిగిన సాంకేతిక సిబ్బంది పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలో భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని కృష్ణయ్య తెలిపారు. జేఎన్‌పీసీ మేనేజ్‌మెంట్ కార్మికుల భద్రత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను మేనేజ్‌మెంట్ ప్రతినిధి జె.సుబ్బారావు వివరించారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా అగ్నిమాపక శాఖ, బ్రాయిలర్, జిల్లా పరిశ్రమల శాఖలు, జేఎన్‌పీసీ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

26 నుంచి గుప్త నవరాత్రులు

అనకాపల్లి: మండలంలో బట్లపూడి పంచాయతీ నాయుడుపేటలో చక్రమిళిత అన్నపూర్ణేశ్వరి సోహం ఆశ్రమంలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ గుప్త(వారాహి)నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు కాండ్రేగుల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రులను పురస్కరించుకుని రోజూ ఉదయం 9 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 7 గంటలకు అమ్మవారి హోమం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9966908908, 9292156747 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అడపాదడపా విద్యుత్ కోతలు

కశింకోట: మండలంలో అడపాదడపా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. కశింకోట, తాళ్లపాలెం తదితర ప్రాంతాల్లో అనధికారిక విద్యుత్ కోతలు విధిస్తుండటం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు, వ్యాపారులు వాపోతున్నారు. అయితే అధికారికంగా కోతలు లేవని, విద్యుత్ సరఫరా లోడ్‌కు సరిపడినంతగా ఉందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. గాలులు, వర్షాల వల్ల ట్రిప్పు కావడం, మరమ్మతులు, కొత్త లైన్లు వేస్తుండటం తదితర కారణాల వల్ల అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి



మృతి చెందిన పాడి ఆవుల వద్ద రోదిస్తున్న రైతు కళ్యాణం

చీడికాడ: మాడుగుల నుంచి ఖండివరం రహదారిలో మోసూరి వారి కళ్లాలు వద్ద గల జనపరెడ్డి కళ్యాణంకు చెందిన పాడి ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన కళ్యాణం పశువులను మేతకు వదలగా శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడి రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. బాధిత రైతుకు ఈ పాడి ఆవులే ఆధారం. వీటి ఖరీదు సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని తెలిపారు. బాధిత రైతును చోడవరం సీడీసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు గెంజి స్వాతి, బాలాజీ, చీడికాడ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.

ఆస్పత్రికి మానసిక రోగి తరలింపు



మానసిక రోగిని ఆసుపత్రిలో చేర్చుతున్న పోలీసులు

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో ప్రజలను భయాందోళనకు గురి చేసిన ఓ మానసిన రోగిని పెందుర్తి పోలీసులు చికిత్స నిమిత్తం నగరంలోని మానసిన వైద్యశాలకు తరలించారు. వివరాలివి.. పెందుర్తి జూనియర్ కళాశాల, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఓ వ్యక్తి కొద్దిరోజులుగా సంచరిస్తున్నాడు. తన చేష్టలతో స్థానికులను భయపెడుతున్నాడు. దీనిపై స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సీఐ కె.వి సతీష్‌కుమార్ బ్లూకోట్స్ పీసీ చంద్రశేఖర్‌ను శనివారం అక్కడికి పంపారు. మానసిక వికలాంగుడిని పట్టుకుని వెంటనే నగరంలోని ప్రభుత్వ మానసిక రోగుల ఆసత్రికి తరలించారు.

అనకాపల్లి ఆర్టీసీ డీఎం బదిలీ

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) డిపో మేనేజర్ ఎల్.వెంకటేశ్వరరావు పొన్నూరు డిపోకు బదిలీ అయ్యారు. విజయవాడ ప్రజా రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై గత నెల 7వ తేదీన అనకాపల్లి డిపో మేనేజర్‌గా వచ్చారు. మళ్లీ నెల రోజులకే బదిలీపై వెళ్లారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల బదిలీలు...

అనకాపల్లి ఏసీడీఎస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ జి.కె.లక్ష్మి విశాఖ ఆర్జేడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అల్లూరు సీతారామరాజు జిల్లా కొయ్యూరు ఏసీడీఎస్ కార్యాలయంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న సునీత అనకాపల్లికి సాధారణ బదిలీపై వచ్చారు. ఈ నెల 31న మరో సూపర్‌వైజర్ నిర్మల పదవీ విరమణ చేయనున్నారని సీడీపీవో కె.ప్రభావతి శనివారం తెలిపారు.

యోగాలో దివ్యాంగులు భాగస్వాములు కావాలి



యోగాసనాలు చేస్తున్న దివ్యాంగులు



కశింకోట ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్రపై సిబ్బందికి శిక్షణ

అనకాపల్లి: ఆరోగ్యాంధ్రగా తీర్చిదిద్దేందుకు దివ్యాంగులు యోగా సాధనలో భాగస్వాములు కావాలని యోగా గురువు గంగూరు మంగయ్య తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో యోగాసనాలు చేశారు. ఆయన మాట్లాడుతూ మన శరీరం, మనసు ఆధీనంలో ఉంచుకునేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రోజూ 40 నిమిషాలు యోగా సాధన చేయాలన్నారు. ఇటీవల అరకులో 21,800 మందితో 108 సూర్య నమస్కారాలు చేయించి ప్రపంచ రికార్డు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ జి. అన్నపూర్ణ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్, విజువల్లి చాలెంజర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కోరుపోలు వెంకటేశ్వర, జిల్లా బధిరుల సంఘం ప్రతినిధి వేదుల చంద్రశేఖర్, అనకాపల్లి రూరల్ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఆదారి తులసి సంతోష్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్, సచివాలయ సిబ్బందికి వివిధ ఆసనాలు వేయించడం ద్వారా అవగాహన కలిగించారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్తకోట వారపు సంత మార్పు

రావికమతం : ట్రాఫిక్‌కు ఇబ్బందుల కారణంగా కొత్తకోటలో శనివారం జరిగే వారపుసంతను సాయిబాబా ఆలయం వెనుక ఉన్న మార్కెట్ యార్డ్‌లోకి మార్చామని సర్పంచ్ కోన లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, పంచాయతీ ఈవో జ్యోతి రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, వైఎస్ఆర్‌సీపీ నాయకులుశీలం శంకర్, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. శనివారం ఇక్కడ జరిగే వారపు సంతకు చుట్టుపక్కల గ్రామాలైన చీమలపాడు పంచాయతీ శివారు గిరిజన గ్రామాల ప్రజలు, కన్నంపేట, వమ్మవరం గ్రామాల నుంచి వచ్చి వారానికి సరిపడా సరుకులు, కూరగాయల కొనుగోలు చేస్తారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. గత వైఎస్సార్ ప్రభుత్వంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సత్యదేవా, సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, శీలం శంకర్, ఎంపీటీసీ సభ్యుడు గున్నాజీ తదితరులు నాబార్డు నిధులు రూ.17 లక్షలతో మార్కెట్ యార్డ్ నిర్మించారు. యార్డ్‌లో మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సంతను గతంలో మార్కెట్ యార్డ్‌కు తరిలించారు.. కానీ వ్యాపారులు బీఎన్ రోడ్డుపైనే వ్యాపార లావాదేవీలు చేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో గ్రామనాయకులు, కొత్తకోట పోలీసులు, పంచాయతీ సిబ్బంది కలిసి శనివారం వారపు సంతను మార్కెట్ యార్డుకు తరలించారు.



మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్న వారపు సంత